క్లుప్తంగా

ఘనంగా ధమ్మ దీక్షా వేడుకలు



బుద్ధ వందనం చేస్తున్న బుద్ధ విహార్, బీఎస్ఐ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అశోక ధర్మ చక్ర పరివర్తన దివస్(విజయ దశమి) సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ ధమ్మ దీక్షా వేడుకలు బుద్ధవిహార్, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బుద్ధ విహార్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత బుద్ధ పూజ, బుద్ధ వందనం చేశారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ ప్రతినిధి నాగాబత్తుల ప్రసాదరావు, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు రామ్ బోధి, డాక్టర్ పిల్లి రాంబాబు, ములపర్తి సత్యనారాయణ, ఎంఏకే భీమారావు, పెనుమాల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

అమలాపురం టౌన్: స్థానిక సాయి సంజీవిని హాస్పటల్‌లో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 800 మందికి వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు ప్రారంభించారు. కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూరాలజీ, అంకాలజీ తదితర 15 వైద్య విభాగాలకు చెందిన స్పెషలిస్టులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ చిరువూరు పవన్‌కుమార్, డాక్టర్ సాయిశిల్ప తదితరులు రోగులను పరీక్షించారు. శిబిరంలో అంతర్జాతీయ వాకర్స్ చీఫ్ కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు గుర్రం రామకృష్ణారావు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడ గ్రామానికి చెందిన సూరంపూడి జయశంకర్ మణి ప్రత్యూష్ రూ.10,116 విరాళాన్ని ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి కఠారి శ్రీనివాసరాజుకు శనివారం అందజేశారు. వారికి ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులను సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.

బాధితుడికి రూ.10 వేల సాయం



బోడసకుర్రులో బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాట్రేనికోన: మండలంలోని బోడసకుర్రు గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పాలెపు వెంకటేశ్వర్లుకు గచ్చకాయలపోరకు చెందిన ప్రజాసేవ చారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. నిరుపేద రోగులను గుర్తించి ఆర్థిక సహాయం అందజేసి తోడుగా నిలబడుతున్న ట్రస్ట్ సభ్యులను ఎంపీపీ పాలెపు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్‌కుమార్, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, గ్రామ పెద్దలు అభినందించారు.

గజవాహనంపై ఊరేగిన లక్ష్మీనృసింహుడు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి శనివారం భక్తులు అత్యధిక సంఖ్యలో పోటెత్తారు. విజయ దశమి పర్వదినానికి తోడు సెలవు రోజు కావడంతో భక్తుల తాకిడి ఎక్కువైంది. ఆలయంలో నిర్వహించే నారసింహ సుదర్శన హోమం, అభిషేకంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు. విజయ దశమి సందర్భంగా ఆనవాయితీగా గుర్రాలక్క అమ్మవారి ఆలయం, నీలకంఠేశ్వర స్వామి ఆలయం, రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి ఆలయాల్లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పట్టువస్త్రాలను సమర్పించారు. దసరా ఉత్సవాలు చివరి రోజు శమీ పూజను గుర్రాలక్క ఆలయం వద్ద అర్చకులు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

అక్కడ ఆయనే ఆర్టీఓ

- యానాంలో లేని పర్మినెంట్ ఆర్టీఓ
- నెలలో నాలుగు రోజులే విధులకు హాజరవుతున్న ఇన్‌చార్జి ఆర్టీఓ
- ఇదే అదనుగా డబ్బులు దండేస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి



యానాం ఆర్టీఓ ఆఫీస్

యానాం: యానాం రీజియన్‌లో పర్మినెంట్ ఆర్టీఓను నియమించకపోవడంతో నూతన వాహనాల రిజిస్ట్రేషన్, లైసెన్స్‌ల మంజూరు తదితర పనులు రోజుల తరబడి నిలిచిపోతున్నాయి. ప్రస్తుతానికి పుదుచ్చేరి ఆర్టీఓను ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. అయితే ఆయన మాత్రం యానాంలో నెలకు నాలుగు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. అదీ ఎప్పుడొస్తారో, ఎప్పుడు వెళతారో ఎవరికీ సమాచారం ఉండడం లేదు. ఇదే అదనుగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి అంతా తానై చక్రం తిప్పేస్తున్నారు. సదరు కార్యాలయంలో ప్రత్యేకంగా బ్రోకర్లను నియమించి మరీ తన డ్రైవింగ్ స్కూల్‌కి వస్తేనే పనులు జరుగుతాయంటూ వాహనదారులకు చెప్పిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. అలా కాదని ఎవరైనా నేరుగా కార్యాలయానికి వెళితే పనులు జరగనీయడం లేదని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుతం యానాంలో సదరు కాంట్రాక్టు ఉద్యోగే ఆర్టీఓగా చలామణి అవుతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఎప్పుడొస్తారో ఎవరికీ తెలియదు

నిబంధనల ప్రకారం కొత్త వాహనాలు కొనుగోలు చేసిన 30 రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే పుదుచ్చేరి నుంచి ఆర్టీఓ ఎప్పుడొస్తారో తెలియక రిజిస్ట్రేషన్లలో విపరీతమైన జాప్యం జరుగుతుంది. దీంతో వాహనదారులకు భారీగా జరిమానా పడుతుంది. పైగా యానాంలో రిజిస్ట్రేషన్ చార్జీలు తక్కువగా ఉండడంతో ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కార్లు, బైక్‌లు రిజిస్ట్రేషన్లకు తీసుకొస్తుంటారు. దీంతో విపరీతమైన రద్దీ నెలకొంటుంది. ఎంతమంది వచ్చినా ఇక్కడ పర్మినెంట్ ఆర్టీఓ లేకపోవడంతో ఇన్‌చార్జి ఆర్టీఓ వచ్చినపుడు కార్యాలయం తిరునాళ్లను తలపిస్తుంది. అప్పుడు కూడా కేవలం స్థానికంగా ఉన్న ఓ డ్రైవింగ్ స్కూల్ యజమాని ఇచ్చిన దరఖాస్తులకు మాత్రమే మోక్షం లభిస్తుందన్నది అక్కడ బహిరంగ రహస్యమే. దీంతో వాహనదారులంతా చేసేది లేక అదే డ్రైవింగ్ స్కూల్‌ను ఆశ్రయిస్తున్నారు. సదరు డ్రైవింగ్ స్కూల్ యజమాని ఆర్టీఓ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగి కావడం మరో విశేషం. ఆయనతో పాటు ఎటువంటి నియామక పత్రం లేని మరో మహిళ ఆఫీసులో తిష్ట వేసి చక్రం తిప్పేస్తున్నా అడిగేవారు లేకుండా పోయారు.

దొంగ రిజిస్ట్రేషన్లు సైతం

కారు రిజిస్ట్రేషన్‌కు ఆంధ్రప్రదేశ్‌లో 14 శాతం చార్జీ ఉంటే యానాంలో కేవలం 4 శాతం మాత్రమే వసూలు చేస్తారు. దీంతో దొంగ చిరునామాలతో రిజిస్ట్రేషన్లు కానిచ్చేయడంలో ఆ దొంగ బ్యాచ్ ఆరితేరిపోయారన్న పేరు పొందారంటే అక్కడ జరుగుతున్న అవినీతిని అర్థం చేసుకోవొచ్చు. బైక్ ట్రాన్స్‌ఫర్, లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఎన్‌ఓసీ, ఫైనాన్స్ ఎన్‌ఓసీ తదితర పనుల నిమిత్తం పుదుచ్చేరి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కంటే అదనంగా సొమ్ములు వసూలు చేస్తున్నా ప్రశ్నించే ధైర్యం ఎవరికీ సరిపోవడం లేదు. నేరుగా ఆర్టీఓ కార్యాలయానికి వెళితే ఈ బ్యాచ్ నియమించిన బ్రోకర్లు కాపు కాసి మరీ ఇక్కడ పనులు అవ్వవని, నేరుగా సదరు డ్రైవింగ్ స్కూల్‌కు వెళ్లమని చెబుతున్నారని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు.

> **నెలల తరబడి జాప్యం**
>
> పర్మినెంట్ ఆర్టీఓ లేక వాహనాల రిజిస్ట్రేషన్ నెలల తరబడి నిలిచిపోతుంది. పుదుచ్చేరి నుంచి తాత్కాలికంగా ఆర్టీఓను ఇన్‌చార్జిగా నియమించినా ఆయన నెలలో మూడునాలుగు రోజులు ఉండి వెళ్లిపోతున్నారు. దీంతో స్థానికంగా వాహనాల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యానాంలో పర్మినెంట్ ఆర్టీఓను నియమించి అవినీతిని అడ్డుకోవాలి.
>
> – సుంకర కార్తీక్, సోషల్ యాక్టివిస్ట్, యానాం

ఉత్సాహంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

యానాం: స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 11వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ యానాం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా హోరాహోరీగా జరిగిన పోటీలో అజ్జాపురం, నునపర్తి, విజయవాడ, బిక్కవోలు, యానాం జట్లు విజేతలుగా నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ సెక్రటరీ కాపగంటి అనురాగ ఆదర్శ శేషసుమన్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటుచేశారు.

పంచాయతీ కార్యదర్శికి సత్కారం



అనంతలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్ చెల్లుబోయిన నాని తదితరులు

అల్లవరం: మండలంలోని నడిపూడి గ్రామాన్ని అత్యంత పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దినందుకు ఎంపీ హరీష్‌మాథూర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కలెక్టర్ మహేష్‌కుమార్‌ల చేతుల మీదుగా స్వచ్ఛతాహి సేవ–2024 అవార్డును అందుకున్న పంచాయతీ కార్యదర్శి అనంతలక్ష్మిని గ్రామ ప్రజలు స్థానిక సచివాలయ ఆవరణలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెల్లుబోయిన నాని మాట్లాడుతూ గ్రామానికి తొలి మహిళా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతలక్ష్మి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రంకిరెడ్డి సాంబస్వామి, బాబ్జి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తాళ్లరేవు: మండల పరిధిలో ఉన్న రిలయన్స్ చమురు సంస్థ ద్వారా మండలంలోని గ్రామాల ప్రజలకు ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయాలని సీపీఎం పార్టీ నాయకులు కేఎస్ శ్రీనివాస్, టి.ఈశ్వరరావు, వల్లు రాజబాబు, అదృష్టదీపుడు తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా రిలయన్స్ సంస్థ ఇక్కడ లభించిన ఆయిల్, గ్యాస్‌ను గుజరాత్ తదితర ప్రాంతాలకు తరలించి వ్యాపారం సాగిస్తుందన్నారు. సంస్థ లాభాల్లో మూడు శాతం సీఎస్ఆర్ నిధులు స్థానికంగా వెచ్చించాల్సి ఉన్నా పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా రిలయన్స్ యాజమాన్యం స్పందించి రోడ్లు, తాగునీరు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించి తాళ్లరేవు మండలాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి



అమలాపురంలో ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో జిల్లా పౌరహక్కుల వేదిక ఆధ్వర్యంలో ప్రొఫెసర్ గోకరకొండ సాయిబాబు సంతాప సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల సంఘం ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమలాపురంలో పుట్టి పెరిగిన ప్రొఫెసర్ సాయిబాబా జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు జిల్లెళ్ల మనోహర్, అమలదాసు బాబూరావు, రాష్ట్ర నాయకులు ఏడిద రాజేష్, నామాడి శ్రీధర్, ఎ.రవి, చొల్లంగి త్రిమూర్తులు, మహ్మద్ ఇక్బాల్, వీకేఎస్ పార్టీ అధ్యక్షుడు బొంతు రమణ, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శమీ పూజ



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శమీ పూజ

ఐ.పోలవరం: విజయ దశమిని పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం జమ్మి వృక్షం వద్ద శమీ పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణమూర్తి, అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో స్వామివారిని, అమ్మవారిని జమ్మి వృక్షం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో దాట్ల ఇంద్రరాజు, దాట్ల రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

అలరించిన శ్రీనివాస కల్యాణం నాటకం



శ్రీనివాస కల్యాణం నాటక ప్రదర్శన

యానాం: యానాం భూసమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించిన శ్రీనివాస కల్యాణం భక్తిరస పౌరాణిక నాటకం అందరినీ అలరించింది. ముఖ్యఅతిథిగా హాజరైన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నాటకాన్ని ప్రారంభించారు. నాటకంలో కోన అప్పారావు మాస్టారు, ఆకాశరాజు, దంగుడుబియ్యం కృష్ణ, హంసాని రామలక్ష్మణుడు, కోన దేవ, కోన సుబ్రహ్మణ్యం, పంతాని దత్తతేజ, మల్లిపూడి సత్తిబాబు, మల్లాడి విష్ణు తదితరులు తమ పాత్రల్లో ఒదిగిపోయారు.

వెంకన్నాయుడికి మాజీ సీఎం జగన్ పరామర్శ

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో గుండెకు స్టంట్లు వేయించుకున్నారు. హైదరాబాద్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్న నాయుడికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఫోన్ చేసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు వస్త్రదానం చేస్తున్న దాత

అమలాపురం రూరల్: మండలంలోని ఇమ్మిడివరప్పాడు మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు శనివారం తన మాతృమూర్తి జయలక్ష్మి మూడో వర్ధంతి సందర్భంగా అన్నదానం, వస్త్రదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి తాళ్ల సత్యనారాయణమూర్తి అతిథిగా పాల్గొని వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాళ్ల సాంబమూర్తి, కాశి మురళీకృష్ణ, నాతి గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్: పట్టణంలోని శివాలయం రోడ్డులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో గత 23 ఏళ్లుగా కార్తిక మాసంలో నిర్వహిస్తున్న లక్ష రుద్రాక్ష, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమ తదితర పూజా మహోత్సవాల వాల్‌పోస్టర్, ఆహ్వాన పత్రాలను ఆలయ అనువంశిక ట్రస్టీ బోర్డు చైర్మన్ మాచిరాజు రవికుమార్, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దొంతంశెట్టి శ్రీధర్, ఆలయ కమిటీ సభ్యులు వాడ్రేవు గురువరాజు, కాళ్లకూరి బుజ్జి, కాలే సాయిప్రసాద్, యర్రమిల్లి పాండురంగారావు, మాచిరాజు నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

20 మంది రక్తదానం



శివన్నారాయణను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు తదితరులు

తాళ్లరేవు: పి.మల్లవరం మాజీ సర్పంచ్, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పుట్టినరోజు సందర్భంగా పత్తిగొందిలోని కేవీఎస్ కన్వెన్షన్‌లో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరంలో సుమారు 20 మంది రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ శివన్నారాయణ పేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ఎండీయూ డబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్, చిట్టూరి కలికిమూర్తి, ధూళిపూడి చక్రం, పృథ్వీ పాల్గొన్నారు.

మిన్నంటిన దసరా సంబరాలు



కామాక్షి పీఠంలో మహా చండీయాగం, పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు



విలసవిల్లిలో చండీ యాగం చేస్తున్న పండితులు

- ముగిసిన శరన్నవరాత్ర ఉత్సవాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అమలాపురం టౌన్: శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక కామాక్షి పీఠంలో శరన్నవరాత్రులు పురస్కరించుకుని ఏర్పాటుచేసిన చండీ సప్త సతి పారాయణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీలక్ష్మీ గణపతి హోమం, రుద్ర హోమం, మహా చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కామాక్షీ పీఠాధిపతి శ్రీశ్రీ కామేశమహర్షి పర్యవేక్షణలో పూర్ణదీక్షపరులు బ్రహ్మశ్రీ గోవిందవర్జులు, దుర్గా నాగేంద్ర భాస్కర శర్మ చండీయాగాన్ని నిర్వహించారు. అనంతరం నవరాత్ర పూజలు, అష్ట విధ హారతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహా పూర్ణహూతిలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అలరించిన దివ్య దర్శనం

విజయదశమి సందర్భంగా బ్రహ్మకుమారీల ఓం శాంతి కేంద్రం అమలాపురం శాఖ ఆధ్వర్యంలో స్థానిక గరిగుంట చెరువు వద్ద ఉన్న ఓం శాంతి భవనంలో చైతన్య దేవీల దివ్య దర్శనం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి అవతారాలతో బాలికలు చైతన్య దేవీల దివ్య దర్శనం రూపకం ప్రదర్శించారు. సాక్షాత్తు అమ్మవార్ల దివ్య దర్శనంగా భావించిన భక్తులు ఈ రూపకాన్ని భక్తితత్వంతో వీక్షించారు. రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి తదితరులు అతిథులుగా పాల్గొని చైతన్యదేవీల దివ్య దర్శన రూపకాన్ని ఆద్యంతం తిలకించారు. ఓం శాంతి కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి, బ్రహ్మకుమారి రూప తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు

ముమ్మిడివరం: దశమి శరన్నవరాత్ర మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. శనివారం విజయదశమిని పురస్కరించుకుని అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. ముమ్మిడివరం మార్కెట్ సెంటర్‌లో శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద బేడబుడగ జంగాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. అలాగే అనాతవరం, లక్ష్మీదేవిలంక, క్రొవ్వానిరేవు గ్రామాల్లో అమ్మవారిని మేళతాళాలతో శక్తి వేషాలు, తీన్మార్ డప్పులు, బాణసంచా కాల్పుల నడుమ పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

అల్లవరం: శరన్నవరాత్రులను పురస్కరించుకుని వాడవాడలా ప్రతిష్ఠించిన అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఆదివారం ఘనంగా ఊరేగించారు. విజయదశమి పర్వదినం సందర్భంగా కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవగుప్తం సెంటర్‌లో దేవి నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా విజయదుర్గ అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్న సమారాధనకు వేలాది మంది భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవగుప్తం హైస్కూల్ సెంటర్‌లో కనకదుర్గ అమ్మవారిని ఊరేగించి నిమజ్జనం గావించారు. బోడసకుర్రులో విజయదశమిని పురస్కరించుకుని బేతాళస్వామి సంబరాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన శ్రీను, టౌన్ అధ్యక్షుడు సంసాని నాని, మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యామ్‌ప్రకాష్, గొవ్వాల రాజేష్, అంబటి శ్రీను, పలివెల చిట్టి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా చండీ యాగం

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి శ్రీరామ మందిరంలో దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం ఘనంగా చండీయాగం నిర్వహించారు. పండితులు మున్నంగి రామకృష్ణ శర్మ దంపతులచే రుద్ర హోమం నిర్వహించి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



చైతన్యదేవీల దివ్య దర్శనం రూపకాన్ని ప్రదర్శిస్తున్న బాలికలు



ముమ్మిడివరంలో అమ్మవారిని ఊరేగిస్తున్న బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం సభ్యులు